సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 24 । జనవరి । 2023



వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఏఎంవీఐ శ్వేత అన్నారు. 8లో



కంద 'బాతు'

రాజవొమ్మంగి: స్థానిక సోమిరెడ్డి రాజు పొలంలో పండిన కంద దుంప బాతు ఆకారంలో చూపరులను అబ్బురపరిచింది.



స్నోయగం

సాక్షి,పాడేరు: కించూరు పంచాయతీ వంటిబీధుల కొండలపై పొగమంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. ప్రతీ రోజు కొండలపై మంచు పాలసముద్రంలా దర్శనమిస్తోంది.

న్యూస్‌రీల్

ఏపీవోగా సుజాత బాధ్యతల స్వీకారం



ఏపీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుజాత

చింతూరు: స్థానిక ఐటీడీఏ ఏపీవోగా కంచర్ల సుజాత సోమవారం బాధ్యతలు చేపట్టారు. కూనవరం ఏటీడబ్ల్యూఏ సుజాతకు ఏపీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే ఆదేశాలు జారీచేశారు. దీంతో ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఏవో రాజ్‌కుమార్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

'స్పందన'లో వినతుల వెల్లువ



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న పీవో, సబ్ కలెక్టర్

రంపచోడవరం: ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల పరిష్కరానికి కృషి చేస్తున్నట్టు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందనకు సుమారు 64 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వై.రామవరం మండలం అప్పర్ పార్టులో వంద మంది రైతులకు సంబంధించి భూమిని సర్వే చేసి మ్యూటేషన్ చేయించాలని చింతలపూడి రైతులు కోరారు. తాడేపల్లి పంచాయతీలోని నీలవరం గ్రామం నుంచి మారేడుమిల్లి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో గల ఐదు కిలోమీటర్లు అటవీ అభ్యంతరాలు తొలగించాలని గిరిజనులు కోరారు. డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జీడి పప్పు తయారీపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత లలిత కామేశ్వరి

రంపచోడవరం: స్థానిక పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజుల పాటు గిరిజన రైతులకు నిర్వహించే జీడి పప్పు తయారీ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పి.లలిత కామేశ్వరి మాట్లాడుతూ ఏజెన్సీలో జీడిమామిడి పిక్కల ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పటికీ, రైతులు చాలా తక్కువ ధరకు విక్రయించవలసి వస్తోందని చెప్పారు. పిక్కల నుంచి పప్పును తయారు చేసే యూనిట్లు ఏర్పాటు చేసుకుని, పప్పుతీసి విక్రయిస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.ఆదర్శ, పి.రాజశేఖర్, ఎస్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



బిడ్డను ఆశ కార్యకర్తకు అప్పగిస్తున్న 108 ఉద్యోగి

గూడెంకొత్తవీధి: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళను ఆస్పత్రికి తరలిస్తుండగా 108లో ప్రసవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. గొడుగుమామిడి గ్రామానికి చెందిన సీందెరి సత్తిబాబు భార్య సీందెరి బేబీ నిండు గర్భిణీ. సోమవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది గ్రామానికి చేరుకుని వాహనంలో ఈమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఆమెకు ఈఎంటీ హరి సుఖప్రసవం చేశారు. ఆడబిడ్డ జన్మించింది. తల్లీబిడ్డలను చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఈఎంటీకి పైలెట్ దావీద్, ఆశకార్యకర్త సహకరించారు.

ముంచుతున్న మంచు!

- మామిడికి పొగమంచు దెబ్బ
- భారీగా పూత దెబ్బతినే అవకాశం
- దిగుబడి తగ్గిపోయే ప్రమాదం
- కలవరపడుతున్న రైతులు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 14,710 హెక్టార్లలో మామిడి తోటలు



విరగబూసిన మామిడి చెట్టు



పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో పొగమంచుకు పూత రాలిపోయిన మామిడి చెట్టు

సాక్షి, విశాఖపట్నం: రెండేళ్ల నుంచి మామిడి రైతుకు కాలం కలిసి రావడం లేదు. వరసగా రెండేళ్లు కోవిడ్ ప్రభావంతో ఎగుమతులు లేక మామిడికి ధర పలకలేదు. పైగా మునుపటి ఏడాది (2021) నవంబరులో తుపాను, భారీ వర్షాలతో పూత ఆలస్యంగా, అరకొరగా పూసింది. దీంతో కాపు, దిగుబడి కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఫలితంగా గత సీజనులో మామిడి దిగుబడి 50 శాతానికి మించలేదు. అయితే గత నవంబరులో తేలికపాటి వర్షాలు కురవడంతో డిసెంబరు రెండో వారం నుంచే మామిడి పూత విరివిగా పూయడం మొదలైంది. ఆరంభంలో వాతావరణం కూడా అనుకూలంగానే ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మంచి దిగుబడులొస్తాయని, కోవిడ్ తగ్గుముఖం పట్టడంతో ఎగుమతులకు ఆస్కారం ఉంటుందని మామిడి రైతుల్లో ఆశలు చిగురించాయి. పైగా డిసెంబరు రెండో వారంలోనే పూత మొదలవడంతో ఉగాది నాటికి కాయలు అందుబాటులోకి వచ్చి మంచి ధర లభిస్తుందని ఆశించారు. కానీ మూడు వారాల నుంచి పొగ/తేనెమంచు విరివిగా కురుస్తోంది. కొన్నిచోట్ల పూత దశలోనూ, మరికొన్ని చోట్ల పిందె దశలోను ఉంది. పొగమంచుతో పూత నల్లగా మాడిపోయి రాలిపోతోంది. పూత రాలిపోతే పిందె కట్టేందుకు వీలుండదు. ఆశించినంతగా కాపు కాయక దిగుబడి పడిపోతుంది. ఇదే ఇప్పుడు మామిడి రైతులను కలవరపెడుతోంది. మామిడి పూత నిలబడడానికి రైతులు వేల రూపాయలు వెచ్చించి వివిధ రకాల మందులను స్ప్రే చేస్తున్నారు. 'నాకున్న 25 ఎకరాల మామిడితోటను కొన్నాళ్ల నుంచి కురుస్తున్న పొగమంచు/తేనెమంచు దెబ్బతీస్తోంది. ఇప్పటికే రూ.75 వేలు వెచ్చించి మూడు దఫాలు మందులు స్ప్రే చేయించాను. అయినా ఫలితం లేదు' అని విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం రెడ్డిపల్లికి చెందిన మామిడి రైతు వైదా గురునాథరావు 'సాక్షి'తో చెప్పారు.

14,710 హెక్టార్లలో మామిడి తోటలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 14,710 హెక్టార్లలో మామిడి తోటలున్నాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటఉరట్ల, నర్సీపట్నం, బుచ్చయ్యపేట, చోడవరం, అనకాపల్లి, దేవరాపల్లి, కె.కోటపాడు, విశాఖపట్నం జిల్లా పద్మనాభం, ఆనందపురం, భీమిలి, పెందుర్తి మండలాల్లో మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి. పొగమంచు ఉమ్మడి విశాఖ జిల్లా అంతటా కురుస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని మామిడి చెట్ల పూతను ఈ పొగమంచు దెబ్బతీస్తోంది. సాధారణంగా ఎకరానికి 18–20 టన్నుల మామిడి దిగుబడి వస్తుంది. గత ఏడాది 10 టన్నుల దిగుబడి కూడా రాలేదు. పొగమంచు ఇలాగే కొనసాగితే మామిడి దిగుబడి 30–40 శాతం దెబ్బతీస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులకు అవగాహన



పొగ/తేనె మంచు వల్ల మామిడి పూతకు వాటిల్లే నష్టం, తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ మంచుతో తేనె మంచు పురుగు సోకే అవకాశం ఉంది. నివారణకు రైతులు ఫాస్ఫామెడాన్ 0.5 మిల్లీలీటర్లు లేదా డైమిథోయేట్ 2 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ మందు 2.5 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి పిందె, ఆకులు, కొమ్మలు, చెట్టు మొదళ్లపైన పిచికారి చేయాలి.

–కొర్ను మన్మథరావు,
జిల్లా ఉద్యాన శాఖ అధికారి, విశాఖ

ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- సబ్‌ప్లాన్‌పై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం
- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- పాతపాడిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



పాతపాడిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

కొయ్యూరు: ఎస్సీ,ఎస్టీల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ నిధులు ఖర్చు చేశామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మరో పది సంవత్సరాల పాటు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో కృతజ్ఞతలు తెలుపుతూ రత్నంపేట పంచాయతీ కొత్తపాడిలో సీఎం చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు మరింతగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మరో పది సంవత్సరాల పాటు సబ్‌ప్లాన్‌ను పొడిగించిందన్నారు.అయితే ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయన్నాయని చెప్పారు. వాస్తవాలను ప్రజలు తెలుసుకుంటున్నారని తెలిపారు. గిరిజన ప్రాంతంలో విద్య,వైద్య సదుపాయాల మెరుగుకు పలు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రాష్ట్ర జనాభాలో 5.3 శాతం ఉన్న గిరిజనుల అభివృద్ధికి 2019–20లో 3.8 శాతం, 2020–21లో 3.9 శాతం, 21–22లో 4.9శాతం ఉపప్రణాళిక నిధులు ఖర్చు చేసినట్టు చెప్పారు.దీనిని వక్రీకరించి ఎటువంటి అభివృద్ధి జరగనట్టుగా ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.అలాంటి వాటిని తిప్పికొట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జె.రాజులమ్మ,సీనియర్ నాయకులు గాడి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు,సావిత్రి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రేగటి ముసిలినాయుడు, రత్నంపేట సర్పంచ్, డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చరిత్రాత్మకం

దుంబ్రిగుడ: ఎస్సీ,ఎస్టీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ మేరకు సబ్‌ప్లాన్ గడువు పొడిగించడం చరిత్రాత్మకమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. కొర్ర పంచాయతీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మరో పది సంవత్సరాలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. సబ్ ప్లాన్ నిధులతో మన్యం ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పాల్గుణ, పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు.

ఏపీ జెన్‌కో సీఈగా శ్రీధర్ బాధ్యతల స్వీకరణ

సీలేరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ పూర్తి



శ్రీధర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న సిబ్బంది

మోతుగూడెం: సీలేరు కాంప్లెక్స్ నూతన చీఫ్ ఇంజినీర్‌గా బొట్టి శ్రీధర్ సోమవారం మోతుగూడెం సీఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలలుగా ఇన్‌చార్జీ సీఈగా ఉన్న వెంకటేశ్వరరావు వద్ద నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన చీఫ్ జనరల్ మేనేజర్ (పరిపాలన)గా విధులు నిర్వహిస్తూ విద్యుత్ సౌదా విజయవాడ నుంచి బదిలీపై సీలేరు కాంప్లెక్స్ సీఈగా వచ్చారు. నూతన సీఈని ఏపీ జెన్‌కో ఎస్ఈ (సివిల్) ప్రశాంత్‌కుమార్, ఎస్ఈ(ఆపరేషన్)వెంకటేశ్వరరావు,ఈఈలు బాబూరావు, బాలకృష్ణ, ఇతర జెన్‌కో అధికారులు,కార్మికులు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఈగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జెన్‌కో ఆస్పత్రి, డీఏవీ స్కూల్, పవర్ హౌస్‌ను ఆయన సందర్శించారు. అనంతరం సీఈ స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీలేరు జలవిద్యుత్ కేంద్రం నిర్మించి 50 ఏళ్లు కావడంతో యూనిట్ ఆధునికీకరణ చేపడతామని తెలిపారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం 5,6 యూనిట్ల నిర్మాణ పనులు చురగ్గా సాగుతున్నట్టు చెప్పారు. సీలేరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ పూర్తి అయిందని,అన్ని అనుమతులు త్వరలో వస్తాయన్నారు. ఇక్కడ అధికారులు,ఉద్యోగులు సంయుక్తంగా సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

రైతుల వద్దే పసుపు కొనుగోలు

కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి, పాడేరు: దళారుల ప్రమేయం లేకుండా ట్రేడర్లంతా నేరుగా గిరిజన రైతుల వద్దే పసుపు కొనుగోలు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఉద్యానవన, వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల అధికారులతో పాటు పసుపు ట్రేడర్లతో సోమవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు నాణ్యమైన పసుపును ఉత్పత్తి చేస్తున్నారని, అయితే దళారుల వల్ల పసుపు రైతులు నష్టపోతున్నారని చెప్పారు. గిరిజన రైతులకు మంచి ధరను కల్పించే లక్ష్యంగా ట్రేడర్లు పసుపును కొనుగోలు చేయాలన్నారు.ట్రేడర్లకు అవసరమైన నాణ్యతతో కూడిన పసుపు నిల్వలను సమకూరుస్తామని చెప్పారు. వారపు సంతల్లో పసుపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, వ్యవసాయ, ఉద్యానవన,మార్కెటింగ్‌శాఖల నుంచి ట్రేడర్లకు పూర్తిస్థాయిలో సహకారం ఉంటుందని, ఎంత మేరకు పసుపు అవసరమో ముందస్తుగా తెలియజేస్తే ఆమేరకు గిరిజన రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. జి.మాడుగుల,హుకుంపేట,పెదబయలు మండలాల్లో గిరిజన రైతులు భారీగా పసుపును సాగు చేస్తున్నారని,నాణ్యమైన పసుపును రైతులు మార్కెట్‌కు సిద్ధం చేసే విధంగా రైతులను చైతన్య పరచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.పసుపు సేకరణ,ఉడక బెట్టడం, బాగా తేమ పోయేంతవరకు ఆరబెట్టే విధానంపై గిరిజన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. మన్యంలో పసుపు నాణ్యత నిర్ధారణకు పరీక్షా కేంద్రాలను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి రమేష్ కుమార్‌రావు,వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాస్,మార్కెటింగ్‌శాఖ ఏడీ రాకేష్,పలువురు పసుపు ట్రేడర్లు పాల్గొన్నారు.

మార్చి నెలాఖరులోగా చేపల విక్రయ అవుట్‌లెట్లు

రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు



కేవీకేలో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

రంపచోడవరం: చేపలు, రొయ్యల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని, కాని వాటి వినియోగంలో వెనుకబడిందని రాష్ట్ర మత్స్యసాంకేతిక పరిజ్ఞాన సంస్థ ప్రిన్సిపాల్ పి.కోటేశ్వరరావు తెలిపారు. వినియోగాన్ని పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా పేరుతో మార్కెట్ చేసేందుకు అవుట్‌లెట్‌ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. రంపచోడవరం సమీపంలోని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన చేపలు, రొయ్యల విలువ ఆధారిత పదార్థాల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా రాష్ట్రంలో నాలుగు వేల చేపలు, రొయ్యల విక్రయ అవుట్‌లెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. 26 జిల్లాల్లో సబ్సిడీతో చేపల విలువ ఆధారిత పదార్థాల స్టాళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్టు ఆయన చెప్పారు. కోవిడ్ సమయంలో రైతులు చేపలు, రొయ్యల విక్రయానికి ఇబ్బందులు పడ్డారని, వాటిని దృష్టిలో పెట్టుకుని చేపలకు రాష్ట్రంలోనే మంచి మార్కెట్ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పీఎంఎస్ పథకం ద్వారా రూ.10 లక్షలు, రూ.20 లక్షలు, రూ.1లక్ష, రూ.2 లక్షల వ్యయంతో యూనిట్ల ఏర్పాటుకు సబ్సిడీతో రుణాలు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. 60 శాతం సబ్సిడీ అందజేసి ఎస్సీ,ఎస్టీ మహిళలతో అవుట్‌లెట్స్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.ఫిష్ ఆంధ్రా పేరుతో ఏర్పాటు చేసే స్టాల్స్ ఒకే మాదిరిగా ఉంటాయని తెలిపారు.

రుచిగా ఉంటేనే మార్కెట్

ఆహారపదార్థాలు రుచి ఉంటేనే మంచి మార్కెట్ ఉంటుందని కోటేశ్వరరావు తెలిపారు. చేపలు,రొయ్యలతో విలువ ఆధారిత పదార్థాల తయారీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదు రోజులు పాటు శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాల ఆధారంగా పదార్థాలు తయారు చేసుకుని మార్కెట్ చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ లలితాకామేశ్వరి, శాస్త్రవేత్త వీరాంజనేయులు పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత



పెళ్లి కూతురు,పెళ్లి కొడుకు కుటుంబ సభ్యుల నుంచి అంగీకార పత్రం తీసుకుంటున్న అధికారులు

ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీ గన్నేడ గ్రామంలో సోమవారం ఐసీడీఎస్ అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. గన్నేడ గ్రామానికి చెందిన కొర్రా సింహాచలం (25), కించాయిపుట్టు పంచాయతీ రాముల గ్రామానికి చెందిన మఠం లక్ష్మి అనే 15 ఏళ్ల బాలికను వివాహం చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా, విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సీడీపీవో ఎస్.రాజేశ్వరి, సూపర్‌వైజర్లు సీహెచ్ వరహాలమ్మ, పార్వతమ్మ, లక్ష్మి, జయభారతి, సత్యనారాయణమ్మ, సిబ్బంది గన్నేడ గ్రామానికి హుటాహుటిన వెళ్లి అడ్డుకున్నారు. పెళ్లికూతురు లక్ష్మి, ఆమె తల్లిదండ్రులు చండాల్, కాంతమ్మ, పెళ్లికొడుకు సింహాచలం, తండ్రి బొన్నేలు, గన్నేడ గ్రామస్తులకు బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. బాల్యవివాహ నిరోధక చట్టం ప్రకారం 18 సంవత్సరాలు నిండని అమ్మాయిలకు, 21 సంవత్సరాలు నిండని అబ్బాయిలకు వివాహం చేసినా, బాల్య వివాహాన్ని ప్రోత్సహించినా పోక్సో చట్టం ప్రకారం కఠినమైన శిక్షలు విధించే అవకాశం ఉందని ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి తెలిపారు. ఈ వివాహాన్ని విరమించుకున్నట్టు పెళ్లి కూతురు, ఆమె తల్లిదండ్రులు,పెళ్లి కొడుకు, ఆయన తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రాలను పోలీసులు సమక్షంలో ఐసీడీఎస్ అధికారులు తీసుకున్నారు.

98 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీవో, సబ్ కలెక్టర్

రంపచోడవరం: ఐటీడీఏ పరిధిలో ఏడు మండలాల్లో 539 గ్రామాలకు గాను ఇప్పటి వరకు 98 గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలో వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూ రక్ష పథకం ద్వారా సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే టీమ్‌లు ప్రతీ రోజు సకాలంలో ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ నెలాఖరు నాటికి రీ సర్వే పూర్తి చేయాలన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ రీసర్వే చేసే ముందు గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ గోదాంలో అక్రమాలపై విచారణ



విచారణాధికారి కృష్ణ

చింతపల్లి: స్థానిక జీసీసీ గ్యాస్ గోదాంలో అక్రమాలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై సోమవారం స్టేట్ కోఆపరేషన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ రిజిష్టర్ పి.కృష్ణ విచారణ నిర్వహించారు. 2020–2021, 2021–2022 సంవత్సరాల్లో గోదాంలో సిలిండర్లు పక్కదారి పట్టడంతో పాటు, రాయితీ గ్యాస్‌కు సంబంధించిన నిధులు దుర్వినియోగమైనట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై విచారణ నిర్వహిస్తున్నామని కృష్ణ తెలిపారు. నివేదికలు ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన చెప్పారు.

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్: స్థానిక ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. విద్యా, వైద్యఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీల పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులకు మూడు రోజుల్లో ఈ వైద్య పరీక్షలు నిర్వహించి, అన్ని రకాల వ్యాధులకు మందులను అందజేయాలని తెలిపారు. విద్యా, వైద్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పాడేరు జిల్లా ఆస్పత్రి, అరకు ప్రాంతీయ ఆస్పత్రి, చింతపల్లి, ముంచంగిపుట్టు సామాజిక ఆస్పత్రిల్లో స్పెషలిస్ట్ వైద్యుల సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా కేసులు గుర్తించి ప్రత్యేక చికిత్స అందించాలని తెలిపారు. వైద్య సేవలు అందించడంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని పీవో హెచ్చరించారు. సంక్రాంతి సెలవుల అనంతరం పాఠశాలలకు పూర్తి స్థాయిలో విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్, డీసీహెచ్ శంకర్‌ప్రసాద్, సీనియర్ వైద్యులు విశ్వేశ్వరనాయుడు, కృష్ణారావు,11 మండలాల ఏటీడబ్ల్యూవోలు, వైద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

వాహనచోదకులు నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న లీలాప్రసాద్

చింతూరు: వాహనచోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్వేత అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం చింతూరులో లారీ, ట్రాక్టర్, ఆటోడ్రైవర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనం నడపవద్దని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రమాదాల బారిన పడవద్దని ఆమె అవగాహన కల్పించారు.

భద్రతా నియమాలు పాటించాలి

చింతపల్లి: వాహనచోదకులు భద్రతా నియమాలు పాటించాలని జిల్లా రవాణాధికారి లీలాప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు.. ప్రమాదాల్లో సహాయం అందించే వ్యక్తులపై ఎటువంటి విచారణలు జరగవని, కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ముందుకు రావాలన్నారు. అటువంటి వారికి ప్రభుత్వం ప్రోత్సాహకం కూడా అందిస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 180 మంది ప్రమాదాల్లో గాయపడి మృతి చెందగా ఎక్కువగా ద్విచక్రవాహన చోదకులే ఉన్నట్టు చెప్పారు. అధిక వేగం ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వాహన నిబంధనలు తెలుసుకోవాలని సూచించారు. వైస్‌ప్రిన్సిపాల్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సరకుల పంపిణీకి చర్యలు


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న శివకుమార్

చింతపల్లి: జీసీసీ ద్వారా గిరిజనులకు సకాలంలో నిత్యావసర సరకులు అందేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శివకుమార్ తెలిపారు. మండల కేంద్రంలో పర్యటించిన ఆయన జీసీసీ గోదాములో సరుకులను సోమవారం తనిఖీ చేశారు. సరకులు సకాలంలో పంపిణీ జరగాలని ఆయన సూచించారు. జిల్లాలో మొత్తం 2లక్షల 97 వేల మంది తెల్ల రేషన్‌కార్డు దారులు ఉన్నారన్నారు. రేషన్ కార్డుల సమస్యలు గ్రామ సచివాలయాల్లోనే పరిష్కరించాలని, లేకుంటే సంబంధిత వీఆర్‌వోలపై చర్యలు తీసుకుంటామన్నారు. సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ ప్రసాద్, జీసీసీ గోదాము సూపరింటెండెంట్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ సేవలు


భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ పోలీసులు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు భోజనం అందజేశారు. మండల కేంద్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 190 మంది పేదలకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంటు ఎం.ఎల్. నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ సిబ్బంది ఉన్నారు.

బాలికా...బెంగలేదిక..!

- లైంగిక వేధింపులకు అడ్డుకట్ట
- పాఠశాలలు, కాలేజీల్లో 'భరోసా బాక్స్'
- సమస్యల పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ
- ఆడపిల్లలకు అండగా నిలువడమే లక్ష్యం
- రక్షణ చట్టాలు పటిష్టంగా అమలు
- బాలిక విద్యకు ప్రోత్సాహమందిస్తోన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నేడు జాతీయ బాలికా దినోత్సవం

పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే బాలికలకు ఏది గుడ్‌టచ్....ఏది బ్యాడ్ టచ్ అనేది తెలుసుకునేలా అవగాహన కల్పించేందుకు జిల్లా విద్యాశాఖ నడుంబి గించింది. 11–18 ఏళ్ల మధ్య గల బాలికలకు భరోసా కల్పించటమే లక్ష్యంగా 'వైఎస్సార్ కిశోరి వికాసం' అనే కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేలా ప్రభుత్వం దృష్టి సారించింది. బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో విద్య, వైద్య, స్త్రీ శిశు సంక్షేమశాఖాధికారులు సంయుక్తంగా విశాఖ జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి.

– విశాఖ విద్య




మధురానగర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన భరోసా బాక్స్, పాఠశాల నుంచి వస్తున్న విద్యార్థినులు

జిల్లాలోని ప్రతి పాఠశాలలో హెచ్‌ఎం గదికి సమీపంలో అందరికీ కనిపించేలా బాలికల కోసం 'భరోసా బాక్స్' ఏర్పాటు చేశారు. బాక్స్‌కు తాళం వేసి, దానిని ప్రతి 15 రోజులకొక సారి సచివాలయ మహిళా పోలీసు, వైద్యారోగ్యశాఖ ఏఎన్‌ఎం సమక్షంలో తెరుస్తున్నారు. ఫిర్యాదులు, సూచనలు, సలహాలు ఉంటే, చీటీ వేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచి, దాని పరిష్కారం కోసం ఎంతవోల దృష్టికి తీసుకెళ్తున్నారు.

యుక్త వయస్సు సమస్యలపై ఫోకస్

బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులతో పాటు, భవిష్యత్‌లో గృహిణిగా ఎదురయ్యే సమస్యలను కూడా ఎలా అధిగమించాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు. ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, సచివాలయ విద్య కార్యదర్శి, మహిళా పోలీసు, పాఠశాల హెచ్‌ఎంతో కూడిన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ప్రధానంగా తొమ్మిది అంశాలపై ఫోకస్ పెట్టారు. బాల్య వివాహాలు, పిల్లల దుర్వినియోగం, పిల్లల అక్రమ రవాణా, రక్త హీనత పోషణ, అమ్మాయిల రుతు పరిశుభ్రత నిర్వహణ, మహిళలు పిల్లల పథకాల కార్యకలాపాలు, మహిళల రక్షణకు 181- హెల్ప్‌లైన్ కేంద్రాలు, వార్డు, గ్రామ, సచివాలయాల సెక్రటరీల పాత్ర, మహిళా మిత్ర, సైబర్ మిత్ర వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

అంతరాన్ని అంతం చేసేలా..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 1,399 పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 3,53,398 మంది విద్యనభ్యశిస్తున్నారు. ఇందులో బాలురు 1,86,415 మంది కాగా, బాలికలు 1,66,983 మంది ఉన్నారు. ఈ లెక్కన పాఠశాల స్థాయి వయస్సు ఉన్న విద్యార్థుల్లో బాలుర కంటే బాలికలు 18,432 మంది తక్కువగా ఉన్నారు. బాలికల నిష్పత్తిని పెంచేలా విద్య, స్త్రీ శిశు సంక్షేమశాఖల భాగస్వామ్యంతో వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజానీకంలో చైతన్యం తీసుకొచ్చేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

బాలికలకు జగనన్న ఇచ్చిన తోడు ఇవే..

చైల్డ్‌లైన్	1098
ఏపీ పోలీసు	100
దిశ	112
ఉమెన్ హెల్ప్‌లైన్	181
ఎమర్జెన్సీ	108
మెడికల్ హెల్ప్‌లైన్	104

పటిష్టమైన చర్యలు



బాలికలకు భరోసాగా నిలవాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయం. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో భరోసా బాక్స్‌లను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చాం. డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు దీనిపై పర్యవేక్షిస్తారు

– ఎల్. చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

బాలికలకు భరోసా కల్పిస్తున్నాం



ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుకునే బాలికలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో బాలికల కళాశాల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేయించాం. బాలికలు ఉన్నత విద్య వైపు వచ్చేలా ప్రోత్సహిస్తున్నాం. ఇంటర్మీడియెట్ బోర్డు ద్వారా కాలేజీల్లో తగిన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

– ఆర్. సత్యనారాయణ, ఆర్‌ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

ధైర్యంగా బడికి



మా బడిలో సకల సౌకర్యాలు ఉన్నాయి. ఆడపిల్లలనే వ్యత్యాసం చూపకుండా మా స్కూల్లో అన్నీ తెలిసేలా చెబుతారు. టీచర్లు ఎంతో స్నేహంగా ఉంటూ, పాఠాలు చెబుతున్నారు. బడిలో భోజనం కూడా ఎంతో రుచిగా ఉంటుంది. బడికి ధైర్యంగా వస్తున్నాం. స్నేహితులమంతా కలసి మెలసి ఉంటూ చదువుకుంటున్నాం.

– ఎల్.మంజుల శ్రీ, 7వ తరగతి, ప్రకాశరావు పేట స్కూల్, విశాఖ అర్బన్

బాలిక విద్యకు ప్రోత్సాహం



బాలిక విద్యను ప్రోత్సహించేలా సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బాలికల డ్రాపవుట్ ఉన్నట్‌లైతే, వెంటనే ప్రత్యేక టీమ్ వారి వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకుంటుంది. బాలిక విద్యను ప్రోత్సహించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– వానపల్లి శైలజ, ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్, విశాఖ జిల్లా

పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు


కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసిన గూడెంకొత్తవీధి ఎంపీపీ కుమారి తదితరులు

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి మండలంలోని పెదవలస సచివాలయం పరిధిలోని పెదలంక, మొండిగెడ్డ పంచాయతీలోని వనభలింగం పాఠశాలల అభివృద్ధికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేకంగా రూ.4లక్షల నిధులను మంజూరు చేశారని ఎంపీపీ బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్‌లు తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ప్రజాప్రతినిధులు, నాయకులు, సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కొట్టగుళ్లి బాగ్యలక్ష్మి కోరడంతో కలెక్టర్ తమ ప్రత్యేక నిధులను విడుదల చేసినట్టు నాయకులు తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి సహాయం అందించిన కలెక్టర్‌కు ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్ ఎంపీపీలు దేముడు, ఆనంద్, పెదవలస సర్పంచ్ కృష్ణవంశీ ఉన్నారు.

గిరిజన రైతులకు గిట్టుబాటు ధర


పెదబయలు వారపు సంతలో కొనుగోలు చేసిన సరకులను పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాస్

పెదబయలు: మండల కేంద్రంలోని వారపు సంతను మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు వారపు సంతల్లో అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను పరిశీలించినట్టు చెప్పారు. సంతలో పిప్పళ్లు కిలో రూ.360 నుంచి రూ.400 వరకు, పాత పసుపు రూ.65, కొత్తది రూ.55, వలిసెలు రూ.75, రాజ్మా (తెలుపు) రూ.110, రాజ్మా (ఎరుపు) రూ.80 ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారన్నారు. సంతలో అనకాపల్లి జిల్లా మాడుగుల, అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు తదితర ప్రాంతాల నుంచి సుమారు 35 నుంచి 40 మంది వ్యాపారులు వచ్చినట్టు తెలిపారు. సంతలో అన్ని రకాల సరకులు కలిపి కోట్లలో వ్యాపారం జరుగుతుందన్నారు. ఈ వారం ఎక్కువగా రాజ్మా, పిప్పళ్లు సంత మార్కెట్‌లో వ్యాపారం జరిగినట్టు తెలిపారు. సంతలో జరిగిన వ్యాపారానికి సంబంధించిన నివేదికను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందజేయనున్నట్టు చెప్పారు. 16 గ్రామ సచివాలయాల, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు


ప్రశాంత్‌కుమార్‌ను అభినందిస్తున్న డీఈవో రమేష్


విద్యార్థిని అనురాధను అభినందిస్తున్న హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు


విద్యార్థిని ధనలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు

సాక్షి, పాడేరు: ఇటీవల శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో హైజంప్‌లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల గిరిజన విద్యార్థి ప్రశాంత్‌కుమార్ ప్రథమ స్థానం సాధించాడు. పదో తరగతి చదువుతున్న ప్రశాంత్‌కుమార్ అండర్–14 విభాగంలోని హైజంప్‌లో ప్రతిభ చూపడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడంపై పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థి ప్రశాంత్‌కుమార్‌తో పాటు, పీడీ బి.సత్యవతిని సోమవారం డీఈవో రమేష్ అభినందించారు.

ముంచంగిపుట్టు: శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్ కమ్ స్టేట్ సెలక్షన్ చాంపియన్‌షిప్‌లో అండర్–17 షాట్ పుట్ విభాగంలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక పాఠశాల–1లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని లకే అనురాధ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం పి.లక్ష్మీ, ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థిని అనురాధకు అభినందనలు తెలియజేశారు. పీడీ నరసింహామూర్తి, ఉపాధ్యాయులు ఈశ్వరమ్మ, పావని, గోపాలం, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: జాతీయ స్థాయి పరుగు పందెంలో విద్యార్థిని ధనలక్ష్మి ఎంపికపై కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు తదితరులు అభినందించారు. వారు మాట్లాడుతూ విశాఖలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లోని పరుగు పందెం విభాగంలో కళాశాల విద్యార్థిని ధనలక్ష్మి తృతీయ స్థానంలో నిలించిందన్నారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పరుగు పందేం పోటిలకు అర్హత సాధించడం అభినందనీయమన్నారు, పీడీ అప్పారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మెడల్స్‌తో విద్యార్థులు

అరకులోయ రూరల్: రాష్ట్ర సాయి అథ్లెటిక్స్ పోటీలో స్థానిక గురుకులం కళాశాలకు చెందిన విద్యార్థులు విజయం సాధించారు. ఈనెల 22న శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో శెట్టి లోహిత్ పరుగుపందెంలో మొదటిస్థానం నిలిచి గోల్డ్ మెడల్ సాధించగా, రెండో స్థానంలో శ్యామ్ సిల్వర్ మెడల్ కై వసం చేసుకున్నాడు. లాంగ్ జాంప్, ట్రిపుల్ జంప్‌లో గోపాల్ మొదటిస్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ మూర్తి, గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు. ఆయా క్రీడాకారులను పలువురు అభినందించారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత


పాముకాటుకు గురైన గిరి మహిళకు సహాయక చర్యలు అందిస్తున్న సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి

గూడెంకొత్తవీధి: కాఫీ తోటల్లో పండ్ల సేకరణకు వెళ్లిన గిరిజన మహిళను పాము కాటేసిన సంఘటన సోమవారం గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ రావిమానుపాకలు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన సాగిన లక్ష్మమ్మ అనే మహిళ కాఫీ పండ్ల సేకరణకు వెళ్లింది. తోటల్లో పాము ఈమెను కాటేసింది. దీంతో ఈమె అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న రింతాడ పంచాయతీ సర్పంచి బొబ్బిలి లక్ష్మి పాముకాటుకు గురైన బాధిత మహిళకు సపర్యలు చేసి దగ్గరుండి ఆసుపత్రికి తరలించారు.

మద్యం మత్తులో సరుగుడు లారీపై దాడి

నలుగుర్ని అరెస్టు చేసిన పోలీసులు

చోడవరం: అటుగా వెళుతున్న సరుగుడులోడు లారీపై మందుబాబుల వీరంగం చేసి అద్దాలు పగులగొట్టిన కేసులో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు చోడవరం ఎస్‌ఐ అప్పలనాయుడు సోమవారం తెలిపారు. సబ్బవరం మండలం వంగలి గ్రామానికి చెందిన సరుగుడు లారీ యజమాని గవర కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు. ఆదివారం రాత్రి చుక్కపల్లి నుంచి గజపతినగరం వే బ్రిడ్జి కాటాకు సరుగుడు లోడు వేసుకొని వస్తుండగా చోడవరం మండలం ఖండిపల్లి రోడ్డులో అన్నవరం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు పూటుగా మద్యం మత్తులో వెళ్లి లారీని అడ్డగించి దాడి చేశారు. లారీ అద్దాలు పగులగొట్టి, డ్రైవర్ నుంచి రూ. 400 డబ్బులు వసూలు చేసి వీరంగం చేయడంతో లారీ డ్రైవర్ చోడవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకొని వీరంగం చేస్తున్న మందుబాబులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. గొడవ చేసిన గులజాన సాయి దుర్గాప్రసాద్, పిల్ల జగదీష్, మహారాజు ప్రసాద్, కోటి మనోహర్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ అప్పలనాయుడు తెలిపారు.

హతురాలు కొత్తపల్లి మహిళ

- ఒడిశా సరిహద్దులో గుర్తు తెలియని మృతదేహం వివరాలు లభ్యం
- అనకాపల్లికి చెందిన వ్యక్తి హత్య చేసినట్టు సమాచారం
- విచారణ జరుపుతున్న పోలీసులు


ఆకురాతి వరలక్ష్మి మృతదేహం

కశింకోట: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మహిళ ఒడిశాలో దారుణ హత్యకు గురి అయినట్టు తెలియడం సోమవారం కలకలం రేపింది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో రెండు రోజుల క్రితం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన విషయం విదితమే. చిత్రకొండ సమితి దొరగూడ–పప్పులూర్ ప్రధాన రహదారిలో అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి నేరాన్ని అంగీకరిస్తూ సోమవారం అనకాపల్లి పోలీసులకు లొంగిపోవడంతో బాధితురాలి ఉదంతం వెలుగు చూసింది. మరింత సమాచారం కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివి. కొత్తపల్లికి చెందిన ఆకురాతి వరలక్ష్మి (46)కి అనకాపల్లి మండలం మాకవరం గ్రామానికి చెందిన వ్యక్తితో పరిచయం ఉంది. శ్రీకాకుళం తీసుకు వెళతానని చెప్పి ఈ నెల 20న ఒడిశా–ఆంధ్ర సరిహద్దులోని చిత్రకొండ పోలీసు స్టేషన్ పరిధి కాకరపాడు వద్ద మారుమూల ప్రాంతానికి ఆమెను తీసుకువెళ్లిన నిందితుడు పీక కోసి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో నిందితుడు సోమవారం అనకాపల్లి పట్టణ పోలీసు స్టేషన్‌లో నేరాన్ని అంగీకరిస్తూ లొంగిపోయినట్టు సమాచారం. కాగా ఘటనపై అనకాపల్లి పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణను సంప్రదించగా ఇంకా పూర్తిగా విచారణ జరపాల్సి ఉందన్నారు. ఈ సంఘటన గురించి తెలియడంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులను ఆశ్రయించి ఒడిశా నుంచి హతురాలి మృతదేహాన్ని తీసుకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. హత్యకు పాల్పడడానికి గల కారణాలు గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. హతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

యువ రచయిత శ్రీను మృతికి సంతాపం


ఉగ్గిన శ్రీను (ఫైల్)

రావికమతం: రావికమతం గ్రామానికి చెందిన యువ రచయిత ఉగ్గిన శ్రీను ఆదివారం రాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. డిగ్రీ వరకూ చదివిన అతడు తన రచనలు, కవితల ద్వారా సామాజిక చైతన్యాన్ని రగిల్చారు. వీటికి గుర్తింపుగా ప్రకాశం జిల్లా రచయితల సంఘం తరఫున తెలుగు ప్రాభవ పురస్కారం, శ్రీశ్రీ కళావేదిక పురస్కారం వరించాయి. పున్నమి, ఉస్మానియా తెలుగు రచయితల సంఘం తరఫున ప్రశంసా పత్రాలు అందుకున్నారు. కుమారుడు హఠాన్మరణంతో శ్రీను కుటుంబీకులు, మిత్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక సంఘం, కవి మిత్ర పరివారం, విశాఖ జిల్లా శ్రీశ్రీ కళావేదిక నిర్వాహకులు శ్రీను భౌతిక కాయాన్ని సోమవారం సందర్శించి ఘన నివాళులర్పించారు.

నైపుణ్య కోర్సులకు ఉచిత శిక్షణ

చోడవరం: ఉచిత నైపుణ్యాభివృద్ధి కోర్సులకు చోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కాలేజీ ప్రిన్సిపాల్ కె.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చోడవరం కాలేజీలో మంజూరు చేసిన స్కిల్ హబ్‌లో ఈ కోర్సులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. టైలరింగ్, ఏసీ టెక్నీషియన్ కోర్సుల్లో రెండు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. టైలరింగ్‌కు 8వ తరగతి, ఏసీ టెక్నీషియన్‌కు 10వ తరగతి కనీస విద్యార్హత కలిగి ఉండాలన్నారు. శిక్షణ పొందాలనుకున్న అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి నెల నుంచి నెల నుంచి శిక్షణ ప్రారంభమౌతుందన్నారు. వివరాలకు 9133203064, 9492807312 సంప్రదించాలన్నారు.

అగ్ని ప్రమాదంలో హెచ్‌ఎం మృతి


నాగేశ్వరరావు (ఫైల్)

రోలుగుంట: కొమరవోలు గ్రామంలో గల ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్రి నాగేశ్వరావు (61) అగ్నిప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన శనివారం నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో పెదబొడ్డేపల్లి గ్రామంలో గల తన ఇంట్లో రాత్రి భోజనం చేసి నిద్రపోయారు. అయితే అతను కాల్చి పడేసిన సిగరెట్ కారణంగా కొంత సమయానికి మంటలు రేగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో అతను తీవ్రంగా కాలి గాయపడ్డారు. వెంటనే అతనిని కుటుంబీకులు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్టు ఆయన కుటుంబీకులు తెలిపారు. మృతుని భార్య లక్ష్మి రోలుగుంట మండలంలో కుసర్లపూడి ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమార్తె ఉన్నారు.